"గురుదేవా! నేను చేసిన పని తప్పేనా? ఆ దోషానికి నిష్కృతి లేదా?"


"చంద్రా! ధర్మ సంబంధమైన ఇటువంటి ఘటన చాలా శతాబ్దాల కిందట జగద్గురువైన ఆదిశంకరుల విషయంలో జరిగింది. ఆ కారణంగానే ఆయన అవధూత కాలేక సన్యాసిగానే మిగిలిపోయాడంటారు. పెద్దల చర్యలకి అంతరార్థాలుంటాయి. నీవంటి అల్పుల విషయంలో ఆ మాట వర్తించదు. శంకరులు ఒక సందర్భంలో మద్యం సేవించారట! అది చూసి కొంతమంది మతిమాలిన శిష్యులు కూడా చాటుగా మద్యం సేవించారట. ఒక రోజు శిష్య బృందంతో కలసి వెళ్తున్న ఆ ఆచార్యులు కమ్మరి



కొలిమిలో సలసల కాగుతున్న సీసం తీసుకుని గటగటా త్రాగేశారట! అదే పని శిష్యులు అనుకరించగలరా? నివ్వెరపోయి చూడటం తప్ప!

'బలవానింద్రియ గ్రామో
విద్వాంసమపి కర్షతి
-కర్షతి
-కర్షత్యేవ!

సాధారణ మానవులకి అమోఘమైన సూత్రాలు వర్తించవు. ఏది ఏమైనా నీ ధర్మ సందేహానికి తక్షణ పరిష్కారం నా వద్ద లేదు. మేము మా సూక్ష్మశరీరంతో ఈరేడు లోకాలూ సంచరిస్తూ అక్కడి ఆరూఢులను కలుసుకుంటూవుంటాం. ఇది వారితో చర్చించి వచ్చే పున్నమి నాటి రాత్రి ఇక్కడికి వస్తే నీ సమస్యకి పరిష్కారాన్ని చూపించగలం. అంత వరకూ దుర్గమమైన ఈ వింధ్య అరణ్యాల చాయలకి రావద్దు..."




(ఈ ఇంద్రియాల సమూహం ఎంతటి వివేకవంతుడినైనా ఆకర్షణకి గురి చేస్తుంది. - ఇంకా ఆకర్షిస్తుంది - మరీ ఆకర్షిస్తుంది - అని మహాకవి భారవి చెప్పాడు కదా గురుదేవా?')

"నీ తప్పుల్ని కప్పి పుచ్చుకోవడానికి చేసే కుతర్కాలు చాలించు. నేను ఆ విద్యను నీకు ధారాదత్తం చేసినప్పుడే కఠోర నియమాలు శాసించాను. కామంతో కళ్లు కప్పి విద్యని నీవు స్వప్రయోజనం ఆశించి దుర్వినియోగం చేశావు. అది పాపమే అని నా మనస్సు చెపుతోంది. కనుక ఫలితం ఎటువంటిదైనా నీవు అనుభవించక తప్పదు."

'మన ఏవ మనుష్యాణాం
కారణం బంధ మోక్షయోః॥
- బంధాల్లో ఇరుక్కోడానికీ,
విముక్తి పొందడానికీ మానవుని
మనస్సే కారణం..'

ఈ విధంగా శ్రీ కృష్ణ భగవానుడు గీతలో ఉద్బోధించలేదా?"

"మీ ఆజ్ఞ శిరసా వహిస్తాను గురుదేవా! వచ్చే పున్నమికి తప్పక మీ దర్శనం చేసుకుంటాను. అనుగ్రహించండి"

"శుభం భవతు"

ఆ కీకారణ్యం నుండి బైటపడి జనావాసాల్లోకి వస్తూ వుండగా శరత్‌చంద్ర మనస్సు గతంలోకి దూసుకుపోయింది.

✣ ✣ ✣

అవి అతను కాలేజీలో చదివే రోజులు.. కాలేజి బ్యూటీ నయనతార సినిమా తారలాగా కళ్ళు మిరుమిట్లు గొలిపే అందంతో అప్సరసలాగా యువకులందరి మనసులు దోచుకునేది. క్లాస్‌మేట్ ఐన అతను ఆమె అంటే పిచ్చి ఆరాధనతో రాత్రీ పగలూ వెంటపడేవాడు. బయట పడని ప్రేమికులు డజన్ల సంఖ్యలో వుంటే, బాహాటంగా తమ ప్రేమని చాటుతూ వెర్రివేషాలు వేసే వాళ్ళు పదిమంది దాకా ఉండేవారు.

శరత్ చంద్ర వాళ్లందరికంటే భిన్నంగా నిజాయితీగా ఆమెని ఆరాధించేవాడు. ఆ వికారాలన్నీ తార గమనించకపోలేదు...

ఒక రోజు ప్రైవేటు క్లాసు లేటయింది. గుడ్డి వెన్నెల్లో దగ్గరి దారి కదా అని కాలేజి గార్డెన్‌లోంచి పరధ్యానంగా నడుస్తోంది తార. హఠాత్తుగా ఊడిపడ్డాడు చంద్ర.

"ఐ లవ్యూ"

"ఇలాంటివి చాలా విన్నాను. నువ్వెంత లక్షాధికారివైనా నా మనస్సు ఎన్నటికీ నీమీద లగ్నం కాదు. నీ కళ్లు కామంతో మూసుకుపోయాయి... మర్యాదగా దారి వదులు..."

"లేదు తారా...నేను అలాంటి వాణ్ణికాను. నా మాట నమ్ము. నిన్ను నేను నిజంగా మనసారా ప్రేమిస్తున్నాను. నువ్వు ఏది కావాలంటే అది క్షణంలో తెచ్చి ఇవ్వగలను. నన్ను పెళ్లి చేసుకుంటానని మాట ఇవ్వు...."

చంద్ర ఆమె చెయ్యి పట్టుకున్నాడు.

అతని చెంప ఛెళ్లుమంది...

ఆమె విసవిసా వెళ్ళిపోయింది...

ఆ నిర్జన ప్రదేశంలో చంద్ర ఆవేశంతో బలాత్కరిస్తే ఆమెకి దిక్కెవరు? సన్నజాజి తీగలావున్న ఆమెకి ప్రతిఘటించే శక్తి వుందా? కాని అతనికి అలాంటి పాశవికమైన ఊహ లేనేలేదు... కాని, అతని సంస్కారం ఆమెని ప్రభావితం చెయ్యలేకపోయింది...

ఆరాత్రంతా అర్థం పర్థం లేని ఆలోచనలు చంద్ర మనసులో జోరీగల్లా ముసిరాయి. అద్భుతమైన ఆ అందాల రాశిని అంత దగ్గర్లో చూడగలగటమే ఒకవరం. ఆమె పొందులో అంద గలిగే అమరసుఖాలు అందని ద్రాక్షపళ్లేనా?


జాబిల్లి క్రుంగి, బంగరు బంతిలా పైకెగసే బాలభానుని అరుణ కిరణ కాంతులు నిద్రలేని అతని కళ్లలో ఎర్రగా ప్రతిఫలించాయి... ఏదో ఒకటి చేసి ఆమెని పొందాలి. ఆ అనుభవం కోసం ఎంతకైనా తెగించి ఎలాగైనా సాధించాలి.. అదే అతని జీవిత ధ్యేయం!

ఆనాటి నుండి లక్ష్య సాధన కోసం అతను వెదకని మార్గమే లేదు... తార పెళ్లయి కాపరానికి వెళ్ళినాక కూడా అతని ప్రయత్నం కుంటుపడలేదు.

క్రమంగా అతని దృష్టి బాబాలపైన, స్వాముల పైన పడింది. వాళ్ల దయతో అతీంద్రియ శక్తుల్ని సాధించి తద్వారా మార్గం సుగమం చేసుకోదలిచాడు... కొండలు, కోనలు దాటి వింధ్యారణ్యం ప్రవేశించాడు..

✣ ✣ ✣

రెండేళ్ళ తర్వాత నగరంలో ప్రవేశించి తారని దూరం నుండి చూశాడు... ఆమె చిదిమిన దీపంలా మెరిసిపోతోంది... నవయవ్వనంలోనుండి ప్రౌఢ యౌవనంలోకి ప్రవేశిస్తున్న ఆమె దేహసౌందర్యం కొత్త పుంతలు తొక్కుతోంది... అహర్నిశలూ ఆమె ఊహల్లోనే గడిపే ఆరాధకుడైన భగ్న ప్రేమికుడు చంద్రకి నిలువెల్లా పులకరించి ఆమెపై కోరిక కోటి గుణితం అయింది. అతని శరీరం తమకంతో




## ఆవేదన

భారతమాత భాగ్య విధాత
నాడు కళలకు, సిరి సంపదలకు నెలవమ్మా నీవు
నేడు కల్లోలాలకు, సంక్షోభాలకు నెలవమ్మా నీవు
కరువు, కాలుష్య రక్కసి కబంధ హస్తాలతో కబళించి వేస్తుంటే
ధరల పెరుగుదలతో సామాన్యుని జీవితం సమరమైపోతుంటే
టెర్రరిజం కోరలు చాస్తూ సమాజం పైబడి
రక్తదాహం తీర్చుకుని కరాళ నృత్యం చేస్తూ మృత్యుహేల చేస్తుంటే
పేదరికంతో బాలల బంగారు భవిష్యత్ బుగ్గిపాలు అవుతుంటే
విద్య వ్యాపారంగా మారి, అభ్యసనధ్యేయం ఆర్జన అవుతుంటే
అడవులు అంతరిస్తూ పర్యావరణానికి ప్రమాద మేర్పడుతుంటే
స్వార్థమే పరమార్థంగా మారిన నేటి జీవన శైలిలో
నిజాయితీ చేతకాని తనంగా మిగిలిపోయింది.
స్విస్‌బ్యాంకు ఖాతాలతో నాయకుడు - ఆకలి చావులతో ప్రజలు
అంగరక్షకులతో నాయకులు-అంగవస్త్రంతో నిరుపేదలు
దారిద్ర్యానికి దైన్యానికి పట్టుగొమ్మలుగా దేశం మారిపోయింది
యువకులారా!
నేడు భారతమాత ఆవేదనను ఆలకించండి.
దారిద్ర్య, నిరక్షరాశ్యత నిర్మూలన గావించి
భారతదేశ సౌభాగ్యాన్ని సంపదలను పెంపొందించండి

**- గిండి బాలాజి**

అణువణువూ జ్వలించిపోతోంది. ఆ తాపానికి విరుగుడు చంద్రికా శీతలమైన ఆమె వాలు చూపులే. కాని, ఆమె సదామదాగా కనికరించదని నికరంగా తెలుసు. ఐనా తీరని కోరికలు అడవి జంతువుల్లాగా అతనిపై దుమికి చీల్చి చెండాడుతున్నాయి.

మళ్లీ నిరంతరంగా అదే ఆలోచన.

ఏదో చెయ్యాలి. ఆమెని అందుకుని పొందాలి.

కాని...ఎలా?

ఆ రోజంతా పిచ్చెక్కినట్లు తిరిగాడు.

రాత్రి చీకటి పడుతుండగా వేగంగా వస్తున్న కారు మిరుమిట్లు గొలిపే హెడ్‌లైట్లు అతని కళ్లలో సూదుల్లా గుచ్చుకున్నాయి. కాంతి పడకుండా రెండు చేతులూ అడ్డు పెట్టుకున్నాడు.

అతనిని తప్పించే ప్రయత్నంలో కారు వంపు తిరిగి రోడ్డు ప్రక్కనున్న చెట్టుని గుద్దుకుని ఆగింది. ముందు బంపర్ సొత్తబడింది..

చంద్రకి ఏమీ కాలేదు... బ్రతుకు జీవుడా అనుకుని కాస్త ముందుకుపోయి చూశాడు... ఇంజన్ ఆన్‌లోనే వుండి హెడ్‌లైట్లు వెలుగుతూనే వున్నాయి....

డ్రైవింగు సీట్లో స్టీరింగుపై పడివున్న వ్యక్తిని సీటుపైకి లాగాడు. నాడి పరీక్షించాడు. స్టీరింగు ఛాతీకి గుద్దుకున్న క్షణంలోనే ఆ వ్యక్తి మరణించినట్లుగా తెలుసుకున్నాడు. ఆ వ్యక్తి శరీరంపై స్ఫుటంగా పైకి కనిపించే దెబ్బలేమీ లేవు.


అప్పుడు గుర్తు పట్టాడు....

ఆ చనిపోయిన యువకుడు తార భర్త గౌతమ్ అని! చంద్రమనసులో ఆలోచనలు శరవేగంతో కదిలాయి. అంతకంటే స్పీడుగా ఒక ప్లాను అల్లిపెట్టింది మనసు - అంత వరకూ దారి తెన్నూ లేక కొట్టుకుంటున్నా. చంద్ర గబగబా చెట్టెక్కి ఎట్టి పరిస్థితుల్లోనూకింద పడకుండా, ఎవరికీ కనిపించని విధంగా, కొమ్మల పంగల్లో చేరి మేను వాల్చాడు...

గురువుగారు ఉపదేశించిన "పరకాయ ప్రవేశ విద్య" (ఒకరి ప్రాణాలను వేరొకరి శరీరంలో ప్రవేశింపచెయ్యడం) అనుష్టానం చేసి, ప్రయోగ దశలోకి తీసుకువచ్చాడు...క్షణకాలం గురువుగారి కఠోర శాసనం తలపులో మెరిసింది.

- 'విద్యను ఎన్నడూ దుర్వినియోగ పరచకు'

బలీయమైన కోరిక గురు శాసనాన్ని ధిక్కరించింది. క్రమంగా చంద్ర ప్రాణాలు అతని శరీరంలోనుండి లేచి కారు సీట్లో అచేతనంగా పడివున్న తార భర్త మృతదేహంలో



ప్రవేశించాయి...

చెట్టు కొమ్మల్లో చంద్ర శరీరం జీవరహితంగా పడిపోయింది. తన ప్రమేయం లేకుండానే చంద్ర ప్రాణాలని అప్పు తెచ్చుకున్న గౌతమ్ శరీరం పునర్జీవితమై ఆవులిస్తూ లేచింది. కారు రివర్సు అయి టౌను దిశగా రివ్వున దూసుకుపోయింది సమయం రాత్రి తొమ్మిదిన్నర.

✳ ✳ ✳

ఇల్లు చేరటానికి పదినిమిషాలు పట్టింది.. "వచ్చేశారా? ఇంత లేటయిందేమిటి?" తార అడిగింది...

"ఊఁ! అర్జెంటు బిజినెస్ మీటింగు కాల్‌ఫర్ చేశాం"

"సరే! బట్టలు మార్చుకుని షవర్ చేసి రండి. వేడి వేడి డిన్నర్ రెడీ"

డైనింగ్ టేబిల్ వద్ద అతని కళ్లు ఆమె పల్చటి నైటీలోని నిమ్నోన్నతాలపై పరుగులు తీస్తుండగా యాంత్రికంగా భోజనం ముగించాడు.

"ఏమిటీ - నన్నెన్నడూ ఎరగనట్లు కొత్తగా వింతగా చూస్తున్నారు?"

"నవనవోన్మేషమైన నీఅందాలు నిత్యనూతనం కదా!"

"వో యబ్బో! కవిత్వం వస్తూందే అయ్యగారికి? మీటింగులో ఓ పెగ్గు ఎక్కువయిందా?"

"నీ సౌందర్యం, సాన్నిహిత్యం - వీటిని మించిన మత్తు ఏ లోకంలోనైనా వుంటుందా?"

## గాడ్‌ఫాదర్ లేడు

అమీషాపటేల్ 'నేను గాడ్‌ఫాదర్‌ల సహాయంతో ఎదిగిన దాన్ని కాదు. ఈ రోజున నేను ఇలా ఉండటానికి కారణం నాకున్న ఆత్మవిశ్వాసమే' అంటోంది. 'నా చిత్రాలు వరుసగా ఫ్లాప్ అవుతున్నాయి. దానికి నేనొక్కదాన్నే బాధ్యురాల్ని కాదు కదా? ఎప్పటికైనా మంచినటిగా నిరూపించుకుంటాను' అని సవాల్ చేస్తోంది. (అప్పుడంటే ఎవరూ లేరు కానీ, ఇప్పుడు విక్రమ్ భట్ ఉన్నాడుగా?)

"మీకు నిజంగానే ఏదో అయింది ఈవేళ - ములగచెట్టు ఎక్కిస్తున్నారు"

"నిజం చెపితే ఉలుకెందుకు?"

"అసలు మీరు మీరేనా అని!"

"పోనీ నేను నేను కానని అనుకో"

పాలనురుగులా తెల్లగా - హంస తూలికా తల్పంలా మెత్తగా వున్న డబల్ బెడ్‌పై పడుకుని టీవీలో వానపాట సన్నివేశం చూస్తూ అగరొత్తుల పరిమళాన్ని ఆఘ్రాణిస్తూ, ఏపిల్ పండు తియ్యదనాన్ని ఆస్వాదిస్తున్నాడు గౌతమ్ శరీరంలోవున్న చంద్ర.

జూకాలు, గాజులు, గజ్జెలు మంద్రస్వరంతో సంగీతం వినిపిస్తుండగా దివినుండి భువికి దిగి వచ్చిన దేవకన్యలా గదిలో ప్రవేశించింది తార. అతని కళ్ళు మెరిసాయి. ఎదురు వెళ్లి ఆమెని పొదివి పట్టుకుని దగ్గరికి తీసుకున్నాడు. ఆమె గువ్వలా అతని కౌగిట్లో హత్తుకుని ఒదిగింది. ఎన్నో సంవత్సరాల నిరీక్షణ తర్వాత అతని ఆశలు ఫలించే ఘడియ ఆసన్నమైంది.

సౌందర్యనిధుల్ని గుప్తంగా దాచుకున్న ఆమె సుకుమారమైన దేహమనే క్షేత్రంలో కుశలుడైన కృషీవలుడై అతను ఆనంద వార్నిధి లోతులను కనుగొనసాగాడు.

"ఈరోజు మళ్లీ ఫస్ట్‌నైట్ తలపిస్తున్నారు"

"నా నిరీక్షణంతా ఈ క్షణం కోసమే"

"మీ నిండైన ప్రేమ, అనురాగం కలకాలం నిలవాలి"

"మనది జన్మజన్మల బంధం"

ఆమె తృప్తిగా అతని విశాలమైన ఛాతీపై తల ఆన్చి నిద్రపోయింది. ఇక తెల్లవారుతుండనగా చంద్ర తన ప్రాణాలు తీసుకుని -యశోధరని విడిచి వెళ్తున్న సిద్ధార్థుడిలాగా - సూక్ష్మశరీరంతో గాలిలోకి ఎగిశాడు...

గౌతమ్ కట్టెగా నిర్జీవంగా మిగిలాడు. ఆ సంగతి తెలిస్తే తార ఎంతగా కుమిలిపోతుందో?

చింతాకులమైన మనస్సుతో ఊరవతలనున్న చెట్టుపైగల తన బొందిలో ప్రవేశించి, ఒక్కసారిగా ఒళ్లు విరుచుకుని కిందకి దిగాడు.

తన జీవితధ్యేయమైన మూడో పురుషార్థం నెరవేరింది. గురువుగారి దృక్కోణం తనకి బాగా తెలుసు - శరీరంతో చేసినా, మనస్సుతో చేసినా వ్యభిచారం వ్యభిచారమే. పరదారాగమనం (పరాయివాడి భార్యతో సంగమించటం) పంచమహా పాతకాల్లో ఒకటి. అందునా ఒక పతివ్రతని వంచించటం ఇంకా తీవ్రమైన నేరం! అందువల్ల రౌరవాది నరకాల్లో యుగాల తరబడి తనకి శిక్ష తప్పదు.

పున్నమిలోగా గురువుగారిని కలిసేందుకు వింధ్యారణ్యాల దిశగా సాగిపోయాడు చంద్ర. ❀

## సువర్ణావకాశం

కరీనా కపూర్‌కు నోటిదురుసు ఎక్కువ అని బాలీవుడ్‌లో గుసగుసలు వినిపిస్తున్నాయి. అయితే ఆ విషయాన్ని మరోసారి కరీనా రుజువు చేసింది. సంజయ్‌లీలా బాన్సాలీకి సినిమా తియ్యడం రాదని, కరీనా తాను ప్రెస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పింది. ఈ విషయాన్ని ఇప్పుడు ఖండించినా, కరీనా ఇంటర్వ్యూ టేప్స్‌ను తాను విన్నానని సంజయ్‌లీలా బన్సాలీ చెబుతున్నాడు. కానీ మళ్ళీ కరీనా సంజయ్ ఇంటికి వెళ్ళి మరీ పార్వతి రోల్ అడిగింది. దానితో స్క్రీన్ టెస్ట్ చేసిన తరువాత కరీనా ఈ రోల్‌కి సరిపోదని ఆ చిత్ర దర్శకుడు సంజయ్‌లీలా బన్సాలీ తేల్చి చెప్పాడట. (నోటి దురుసుతనంతో కరీనా ఈ సువర్ణావకాశాన్ని చేజార్చుకుందని బాలీవుడ్ అభిప్రాయపడుతోంది.)

